సాక్షి రాజన్న సిరిసిల్ల

శుక్రవారం, 2, జూన్, 2023



కొనసాగుతున్న రద్దీ

వేములవాడ: రాజన్నను 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. శుభగడియలు కొనసాగుతుండడంతో కొందరు భక్తులు పుట్టువెంట్రుకల మొక్కులు తీర్చుకున్నారు. అధికారులు ఏర్పాట్లు చూశారు.



రాజన్నసేవలో మహారాష్ట్ర స్వామిజీ

వేములవాడ: మహారాష్ట్ర బస్రీ ఆశ్రమ నిర్వాహకులు మణికంఠ మహాస్వామి మస్తల స్వామిజీ రాజన్నను దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించారు. ప్రసాదాలు అందించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.0/28.0

ఆకాశం మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.









తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల సందర్భంగా విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్న జిల్లా కలెక్టర్ కార్యాలయం, వేములవాడ పరిధిలోని నంది కమాన్, వేములవాడ రాజన్న ఆలయం, జిల్లా గ్రంథాలయ భవనం

తొమ్మిదేళ్ల అడుగు జాడలు

- అభివృద్ధిలో ఆదర్శ పథం
- ప్రగతికాంతుల పరుగులు
- మిగిలిన మరిన్ని పనులు
- నేడు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- హాజరవుతున్న మంత్రి కె.తారక రామారావు

సిరిసిల్ల: స్వరాష్ట్ర సాధనకు సంబ్బండ వర్ణాలు.. ముక్కోటి గొంతుకలు ఏకమై నినదించాయి. దశాబ్దాల పోరాటం... ప్రజల ఆరాటం ఫలించింది. స్వరాష్ట్ర కల సాకారమైంది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి నేటికి తొమ్మిదేళ్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తోంది. స్వరాష్ట్రంలో కొత్త జిల్లాగా రాజన్న సిరిసిల్ల ఏర్పాటుతో దశాబ్దాలుగా దరిచేరని అభివృద్ధి తొమ్మిదేళ్లలో అందుబాటులోకి వచ్చింది. జాతీయస్థాయిలో అవార్డులు వరించాయి. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా అభివృద్ధిపై కథనం.



తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకకు జిల్లా కలెక్టరేట్ ఆవరణలో పూర్తయిన ఏర్పాట్లు

చిన్నజిల్లా.. అభివృద్ధిలో మిన్న

వైశాల్యం, జనాభా పరంగా రాజన్న సిరిసిల్ల జిల్లా చిన్నది. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలతోపాటు ఇల్లంతకుంట (మానకొండూరు), బోయినపల్లి (చొప్పదండి) మండలాలున్నాయి. 255 గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు 5,52, 037 జనాభాతో 2019 చదరపు కిలోమీటర్లతో జిల్లా విస్తరించి ఉంది. సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. మంత్రి కేటీఆర్ చొరవతో జిల్లాలో అభివృద్ధి పల్లవిస్తోంది. సిరిసిల్ల పట్టణంలో రోడ్ల విస్తరణ, వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. జిల్లాలో తారు రోడ్డులేని గ్రామాలే కాదు.. శివారు పల్లెలు కూడా లేవు. స్వచ్ఛ భారత్‌లో జిల్లా ఆదర్శంగా, ఉపాధిహామీలో ముందుంది. వందశాతం పన్నుల వసూళ్లు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి సామాజిక అంశాల్లోనూ ముందువరుసలో ఉంది.

సాగులో సగర్వంగా

జిల్లాలో మధ్యమానేరు జలాశయం నిర్మాణంతో భూగర్భ జలాలు పెరిగాయి. సిద్దిపేట జిల్లా కూడవెల్లి వాగు ద్వారా గంభీరావుపేట మండలం నర్మాల మానేరు జలాశయంలోకి గోదావరి జలాలు చేరాయి. జిల్లాలో రికార్డు స్థాయిలో ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం దిగుబడులను రైతులు సాధించారు. వ్యవసాయాభివృద్ధికి 10 గోదాములు నిర్మించారు. చెరువులు, కుంటల అభివృద్ధికి రూ.96.09 కోట్లు కేటాయించారు. మిషన్‌భగీరథలో రూ.1220కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందించే పనులు జరుగుతున్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్యాకేజీ–9లో భాగంగా రూ.980 కోట్లతో మధ్యమానేరు నుంచి ఎగువ మానేరుకు ఎత్తిపోతల పథకం టన్నెల్‌పనులు సాగుతున్నాయి. వేములవాడ ఆలయ, గుడి చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

ఆవిర్భావ వేడుకలకు మంత్రి కేటీఆర్..

కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగే రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు హాజరవుతున్నారు. ముందుగా నేతన్న చౌక్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తారు. అనంతరం కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధిపై ప్రసంగించనున్నారు. మంత్రి గురువారం రాత్రే సిరిసిల్లకు చేరుకుని క్యాంపు ఆఫీస్‌లో బస చేశారు.

ముస్తాబైన కలెక్టరేట్

జిల్లాలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం తెలిపారు. జూన్ 2వ తేదీ నుంచి 22 తేదీ వరకు జిల్లా ప్రగతిని చాటిచెప్పేలా ఉత్సవాలు ఉంటాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కళాకారులు ఈ వేడుకల్లో భాగస్వాములను చేస్తామని అనురాగ్ జయంతి వివరించారు. ఈ క్రమంలో విద్యుత్‌దీపాలతో కలెక్టరేట్ మెరిసిపోయింది. సిరిసిల్ల పట్టణంలోని ప్రధాన కూడళ్లలో విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మారిన నేతన్నల బతుకు చిత్రం

సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో ఎన్నడూ లేని మార్పులు వచ్చాయి. ప్రభుత్వం ఆర్వీఎం, బతుకమ్మ చీరలు, క్రిస్మస్, రంజాన్ వస్త్రోత్పత్తి ఆర్డర్లతో నేతన్నలకు చేతినిండా పని దొరికింది. ఈ ఏడాది రూ.350 కోట్ల ప్రభుత్వ ఆర్డర్లు సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు లభించాయి. 1104 మంది కార్మికులను యజమానులుగా మార్చేందుకు రూ.202.30 కోట్లతో 80 ఎకరాల్లో సామూహిక వర్క్‌షెడ్లు నిర్మాణంలో ఉన్నాయి. బతుకమ్మ చీరల ఆర్డర్లలో మెరుగైన ఉపాధి లభిస్తోంది.

రహదారుల అభివృద్ధి

జిల్లాలో పంచాయతీరాజ్ పరిధి(పీఆర్) లో రూ.525.61 కోట్లతో 825.22 కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు వివిధ గ్రామాల్లో వేశారు. ఆర్ అండ్‌బీ పరిధిలో రూ.391.04 కోట్లతో 28 రోడ్లను, మరో నాలుగు వంతెనలు నిర్మించారు. సిరిసిల్ల పట్టణంలో రూ.79 కోట్లతో రోడ్ల విస్తరణ చేపట్టారు. రుద్రంగి, కోరుట్ల రోడ్డు డబుల్ రోడ్డుగా మారింది. సిరిసిల్లలో నర్సింగ్ కాలేజీని ప్రారంభించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం ఏర్పాటైంది.

ఇవి చేయాల్సి ఉంది

- ఎగువ మానేరుకు మధ్యమానేరు నీరు మల్క పేట రిజర్వాయర్ ద్వారా చేరాలి
- గంభీరావుపేట మండలం నర్మాల వద్ద పెండింగ్‌లో ఉన్న ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ప్రారంభించి స్థానికులకు ఉపాధి కల్పించాలి
- సిరిసిల్లలో వర్కర్లను ఓనర్లుగా మార్చే పథకాన్ని అమలు చేసి కార్మికులకు శాశ్వత ఉపాధి చూపాలి. యారన్ బ్యాంకు ఏర్పాటు చేయాలి
- అపెరల్ పార్క్‌లోకి మరిన్ని పరిశ్రమలు వస్తే.. ఉపాధి అందుబాటులోకి రానుంది
- సిరిసిల్లకు మంజూరైన మెడికల్ కాలేజీని ప్రారంభించాలి. జిల్లా ఆస్పత్రిని 500 పడకల ఆస్పత్రిగా మార్చాలి
- వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- సిరిసిల్లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి
- నేత కార్మికులకు 10 శాతం యారన్ సబ్సిడీని ఏటా పెండింగ్‌లో లేకుండా చెల్లించాలి
- బీడీ కార్మికుల ఈఎస్ఐ ఆస్పత్రి భవనం నిర్మాణం. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులు చేపట్టాలి
- వెంకటాపూర్–రగుడు బైపాస్ రోడ్డు, వేములవాడలో ఆర్డీవో ఆఫీస్‌కు సొంత భవన నిర్మాణం చేయాలి
- వేములవాడ నియోజకవర్గంలో పెండింగ్‌లో సిరికొండ రోడ్డును పూర్తిగా డబుల్ రోడ్డుగా మార్చాలి. మానాల–మరిమడ్ల రోడ్డు పూర్తి చేయాలి.

రేపు రైతు వేదికల్లో వేడుకలు



మాట్లాడుతున్న గడ్డం నర్సయ్య

సిరిసిల్ల: తెలంగాణ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, పెట్టుబడి సాయం అందిస్తూ ఆదుకుంటోందని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య అన్నారు. సిరిసిల్లలోని ఏడీఏ ఆఫీస్‌లో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ 3న శనివారం రైతు దినోత్సవాన్ని నిర్వహిస్తుందని, అన్ని రైతు వేదికల్లోనూ రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గుర్తుచేసుకుంటూ, సామూహిక భోజనాలు చేసి వేడుకలు విజయవంతం చేయాలన్నారు. జిల్లాలోని క్లస్టర్ వారీగా రైతు వేదికల్లో దశాబ్ది ఉత్సవాలు జరుగుతాయని, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఏదో ఒక్కచోట రైతులతో కలిసి భోజనం చేస్తారని గడ్డం నర్సయ్య వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, మండలాల రైతుబంధు సమితి ప్రతినిధులు కల్వకుంట్ల గోపాల్‌రావు, కొంకటి లచ్చిరెడ్డి, ఒజ్జల అగ్గిరాములు, గోపు ప్రతాపరెడ్డి, సీహెచ్.రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4న పోలీసు సురక్షా దివస్

సిరిసిల్లక్రైం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4న పోలీసు సురక్షా దివస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు పోలీసు ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు 'మీ పోలీస్ స్టేషన్ గురించి తెలుసుకోండి' పేరిట వేములవాడ, సిరిసిల్ల పోలీసు స్టేషన్ల సందర్శనకు అవకాశం కల్పించనున్నారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 4.30 గంటల వరకు మహిళల భద్రతపై జిల్లా కేంద్రంలో అవగాహన సదస్సు, సాయంత్రం 5.30 గంటల వరకు రాత్రి 7.30గంటల వరకు సిరిసిల్ల మున్సిపల్ స్టేడియంలో పోలీసు ఎగ్జిబిషన్ మేళాను నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు జిల్లాలోని ప్రజలందరూ ఆహ్వానితులేనని ఎస్పీ వెల్లడించారు.

న్యూస్‌రీల్

అనువంశిక అర్చకుల సమస్యల పరిష్కారానికి సీఎం హామీ



మాట్లాడుతున్న సంకెపల్లి సుధాకర్‌శర్మ

వేములవాడ: వేములవాడ అనువంశిక అర్చకుల సమస్యల పరిష్కారానికి సీఎం హామీ ఇచ్చారని, రాష్ట్ర బ్రాహ్మణ భవన్ ఏర్పాటు, వేదపండితుల గౌరవ వేతనం పెంచడం అభినందనీయమని రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సంకెపల్లి సుధాకరశర్మ అన్నారు. గురువారం ఆయన కుటుంబ సభ్యులతో కలసి రాజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ చాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యురాలు సుమలత శర్మ, నాయకులు మామిడిపల్లి కృష్ణమూర్తి, దేవరాజు, మహేందర్, నమిలకొండ నరహరి, కోటేశ్వరశర్మ, గోపన్నగారి మాధవి, కే.శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రసాదాల గోదాంకు మరమ్మతు



కొనసాగుతున్న గోదాం పనులు

వేములవాడ: వేములవాడ రాజన్న ప్రసాదాల తయారీ గోదాం ప్రమాదం అంచున ఉండటంతో ఇటీవల 'సాక్షి'లో 'ప్రమాదాల అంచున ప్రసాదాల తయారీ' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆలయ అధికారులు ప్రసాదాల తయారీ గోదాంలో స్లాబ్‌ను కూల్చేశారు. మిగితా మరమ్మతు పనులు పూర్తిచేస్తున్నారు. దీంతో స్వామివారి ప్రసాదాల తయారీని ఓపెన్‌స్లాబ్‌లో చేపడుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సిబ్బందికి కూలర్లు ఏర్పాటు చేశారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలి



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన వసతులు లేకపోడవంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కలెక్టర్‌తోపాటు జిల్లా అధికార యంత్రాంగం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన నివాసంలో మాట్లాడుతూ.. ఖమ్మం, మంచిర్యాల నుంచి వచ్చే ధాన్యం లారీలను దిగుమతి చేస్తున్నారని, జిల్లాకు చెందిన ధాన్యాన్ని దిగుమతి చేసుకునేందుకు ఎందుకు ఇబ్బంది పడుతున్నారని ఆయన ప్రశ్నించారు. రైస్ మిల్లర్లకు సరైన సూచనలు ఇచ్చి రైతులకు బాసటగా నిలవాలని అన్నారు.

రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న పులి లక్ష్మీపతిగౌడ్

సిరిసిల్లటౌన్: రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. కొనుగోలు సెంటర్లలోని వడ్లను తక్షణమే కొనుగోలు చేయాలని, రైతుల పండించిన పంటలకు మద్దతు ధర అందించాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 3,4న బోయిన్‌పల్లి మండలకేంద్రంలో జరిగే సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో రైతులందరూ పాల్గొనా లని కోరారు. జిల్లా కార్యదర్శి బియ్యంకార్ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు చిప్ప దేవదాసు, జి. విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దకాలంలో మారిన రాష్ట్ర రూపురేఖలు



ఎల్లారెడ్డిపేటలో వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్

- మంత్రి కే. తారకరామారావు
- దశాబ్ది ఉత్సవాల వెబ్‌సైట్ ప్రారంభం

ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట/ముస్తాబాద్ (సిరిసిల్ల): ఆంధ్రపాలకుల కబంధ హస్తాల్లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని, కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని దశాబ్దకాలంలో అభివృద్ధిలో ప్రపంచం గుర్తించేస్థాయిలో తీర్చిదిద్దడం జరిగిందని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే.తారక రామారావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వెబ్‌సైట్‌ను తొలిసారిగా గురువారం రాత్రి ఎల్లారెడ్డిపేటలోని రెవెన్యూ కార్యాలయంలో ప్రారంభించారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దశాబ్ది ఉత్సవాలను ఊరూరా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, ఆర్డీవో శ్రీనివాసరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీపీ రేణుక, తదితరులు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి

గంభీరావుపేట మండల సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు తల్లి ఇటీవల మృతి చెందింది. ఆయన కుటుంబాన్ని మంత్రి కేటీఆర్ పరామర్శించారు. లింగన్నపేటకు చెందిన తలారి ఆంజనేయులు గృహప్రవేశం సందర్భంగా ఇంటికి వెళ్లి అభినందించారు. ముస్తాబాద్ మండలం చిప్పలపల్లికి చెందిన ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కొమ్మెట రాజమల్లు తండ్రి ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. సిరిసిల్ల పట్టణంలో మాజీ సెస్ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను మంత్రి కేటీఆర్ పరామర్శించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపాలి

ముస్తాబాద్(సిరిసిల్ల): బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లెలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ప్రతాప రామకృష్ణ ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో, ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ మరచిపోయిందన్నారు. బీజేపీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. మండల అధ్యక్షుడు కస్తూరి కార్తీక్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మల్లారెడ్డి, రేగుల మల్లికార్జున్, పార్లమెంట్ కో– కన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, శీలం రాజు, మల్లారపు సంతోష్ రెడ్డి, హన్మంత్‌గౌడ్, అంజాగౌడ్ పాల్గొన్నారు.

జిల్లాకు 'కాయకల్ప' అవార్డుల పంట

- వేములవాడ ఏరియా ఆస్పత్రి, 10 పీహెచ్‌సీలకు అవార్డులు
- ఎకోఫ్రెండ్లీలో రాష్ట్రస్థాయిలో వేములవాడకు మొదటిస్థానం




వేములవాడ ఏరియా ఆసుపత్రి

సిరిసిల్లటౌన్/వేములవాడఅర్బన్: జిల్లా ఆస్పత్రులు జాతీయస్థాయిలో మెరిశాయి. వేములవాడ ఏరియా ఆస్పత్రి, పలు మండలాల్లోని పది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కాయకల్ప అవార్డుల పంట పండింది. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక అవార్డులను గురువారం ప్రకటించిందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు తెలిపారు. వేములవాడ ఏరియా ఆస్పత్రి రాష్ట్రంలోనే మరో అరుదైన ఘనత సాధించింది. కాయకల్పలోని ఎకోఫ్రెండ్లీ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. కాయకల్ప అవార్డులోనూ మూడోస్థానంలో నిలిచింది. ఈ అవార్డులు రావడంపై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే ఏరియా ఆస్పత్రుల్లో అత్యధికంగా ఈ విభాగంలో 86.19 మార్కులు సాధించి ఎకోఫ్రెండ్లీ అవార్డును సాధించిందని వైద్యులు తెలిపారు. ఇందుకు రూ.5లక్షలు నగదు బహుమతి కూడా ప్రభుత్వం అందజేయనుంది. ఆసుపత్రి అభివృద్ధి కోసం ఈ నిధులు వాడుకోవాలి. సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్‌రావు మాట్లాడుతూ వేములవాడ ఏరియా ఆసుపత్రికి కాయకల్పలోని ఎకోఫ్రెండ్లీ రాష్ట్రస్థాయి అవార్డు, కాయకల్పలో మూడోస్థానంలో రావడం తమపై మీద మరింత బాధ్యతలు పెంచింది. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రోత్సాహంతో, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సహకారంతోనే సాధ్యమైందన్నారు. అదేవిధంగా బోయిన్‌పల్లి, కొదురుపాక, కోనరావుపేట, తంగళ్లపల్లి, విలాసాగర్, చీర్లవంచ, నేరెళ్ల, లింగన్నపేట, హన్మాజీపేట, చందుర్తి పీహెచ్‌లు అవార్డులు పొందినట్లు డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు తెలిపారు. పది పీహెచ్‌సీలకు కలిపి రూ.6.50లక్షల నగదు పారితోషికం పొందినట్లు వెల్లడించారు.

ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరగాలి

- లింగ నిర్ధారణపై కఠినంగా వ్యవహరించాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి




మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లటౌన్: ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగేలా వైద్యశాఖ పూర్తి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పీసీపీఎన్‌డీటీ, ఎండీఆర్, టీబీ, ఎంక్వస్ పురోగతిపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జిల్లాల్లో లింగ నిర్ధారణ జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అటువంటి ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లపై కేసులు నమోదు చేయాలని సూచించారు. మెటర్నరీ డెత్‌లపై ఆశావర్కర్లు, ఏఎ న్ఎంలు, డాక్టర్లకు పలు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన ఇల్లంతకుంట, నేరెళ్ల, చందుర్తి, హన్మాజిపేట, బోయిన్‌పల్లిలో పనుల్లో పురోగతి పెంచాలని ఆయా పరిధిలోని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, వైద్యశాఖ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల గడువు పెంపు

సిరిసిల్లకల్చరల్: వివిధ కారణాలతో స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోని పోస్ట్ మెట్రిక్ విద్యార్థుల కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఈ నెల 15 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వి వినోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకుని తమ విద్యార్థుల వివరాలను ఈపాస్ వెబ్‌సైట్‌లో పొందుపరిచేలా చూడాలని ఈ సందర్భంగా సూచించారు.

ధాన్యం తూకం వేయాలని ధర్నా



ఆందోళన చేస్తున్న రైతులు

ఇల్లంతకుంట: మండలంలోని అనంతారం గ్రామంలో ధాన్యం తూకం వేయాలంటూ రైతులు రోడ్డుకు అడ్డంగా కంచె వేసి ధర్నా చేశారు.కొనుగోలుకేంద్రంలో ధాన్యం కుప్పలు పోసి రెండు నెలలు కావస్తున్నా.. 30శాతం కూడా కొనుగోళ్లు పూర్తి కాలేదని, ప్రజాప్రతినిధులు, అధికారులకు సమస్య వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. వర్షానికి ధాన్యం తడిసి మొలకలు వస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. తూకం వేస్తే లారీలు రావడం లేదని, కనీసం కొనుగోలు కేంద్రాలవైపు ఎవరూ రావడం లేదన్నారు. విషయం తెలుసుకున్న ఏఎస్సై మోతిరామ్ రైతుల వద్దకు చేరుకుని సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

క్లుప్తంగా

జరిమానా



రశీదును అందిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సిరిసిల్లటౌన్: బహిరంగంగా చెత్త పడేసిన వారిపై సిరిసిల్ల బల్దియా అధికారులు గురువారం కొరఢా ఝులిపించారు. పట్టణంలో మేరా లైఫ్..మేరీ స్వచ్ఛ శెహర్' కార్యక్రమం కొనసాగుతుండగా మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. పలువురు దుకాణదారులు బహిరంగ ప్రదేశాల్లో పడేయడంతో మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య జరిమానా విధించారు. దుర్గా టిఫిన్ సెంటర్‌కు రూ. 2,000, మటన్ విక్రయదారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వాడటంతో రూ.500 జరిమానాగా విధించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



శ్రీనివాస్‌కు సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్‌ఐ లక్ష్మారెడ్డి

తంగళ్లపల్లి: సెల్‌ఫోన్ పోయినా, చోరీకి చేసినా సీఈఐఆర్ ద్వారా గుర్తించి బాధితులకు అందిస్తున్నామని ఎస్సై లక్ష్మారెడ్డి అన్నారు. ఇందిరానగర్‌కు చెందిన ముద్దం శ్రీనివాస్ ఫోన్ పోగొట్టుకోగా సీఈఐఆర్ గుర్తించి ఆయనకు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫోన్ అప్పగించారు. సెల్‌ఫోన్ పోతే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు. పోలీస్ సిబ్బంది, తదితరులున్నారు.

వీర్నపల్లిలో..

వీర్నపల్లి : మండలంలోని జవహర్ నాయక్ తండా గ్రామానికి చెందిన భూక్య గంగు తన ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై నవత సీఈఐఆర్ ద్వారా గుర్తించి సెల్‌ఫోన్‌ను భూక్య గంగుకు అందజేశారు.

పశుగ్రాసం దగ్ధం



దగ్ధమైన పశుగ్రాసం

బోయినపల్లి (చొప్పదండి): మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన పెంజర్ల దేవయ్య ఇంటి సమీపంలో నిల్వ ఉంచిన పశుగ్రాసం గురువారం సాయంత్రం నిప్పంటుకొని దగ్ధమైంది. పశువుల మేతకోసం నిల్వ ఉంచిన గడివాములు ప్రమాదవశాత్తు కాలిపోయాయని దేవయ్య తెలిపాడు.

ఎల్లారెడ్డిపేటలో..



మంటలు ఆర్పివేసిన ఫైర్‌సిబ్బంది

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండల కేంద్రంలోని భక్తిసంఘం సమీపంలో నిప్పంటుకొని గడ్డి వాములు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే...మండలకేంద్రానికి చెందిన బింగి మల్లేశం, గడ్డమీది నరేశ్‌కు చెందిన గడ్డి వాములు పొలం వద్ద నిల్వచేయగా నిప్పంటుకొని దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా సకాలంలో మంటలను ఆర్పారు. గుర్తు తెలియని వ్యక్తులు అటు వైపు వెళ్తూ నిప్పంటించారని అనుమానిస్తున్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్ కోరారు.

'కేజీ టు పీజీ' పై ఆసక్తి

- ప్రవేశాల కోసం నిత్యం వస్తున్న విద్యార్థులు
- 'వసతి' లేక వెనుకడుగు
- హాస్టల్ సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి



మండలకేంద్రంలోని కేజీ టు పీజీ ప్రాంగణం

గంభీరావుపేట (సిరిసిల్ల): రాష్ట్రంలోనే తొలిసారిగా కేజీ టు పీజీ ప్రాంగణాన్ని గంభీరావుపేటలో నెలకొల్పారు. ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన కేజీ టు పీజీ విద్యాసంస్థల్లో తమ పిల్లలను చదివించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. అడ్మిషన్ల కోసం పాఠశాలకు నిత్యం ఎంతోమంది వస్తున్నారు. మండలకేంద్రం చుట్టు పక్క గ్రామాల నుంచే కాకుండా ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, మాచారెడ్డి, దుబ్బాక, బీబీపేట, దోమకొండ మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి కేజీ టు పీజీలో అడ్మిషన్ల కోసం వస్తున్నారు.

వసతిగృహం లేక..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కేజీ టు పీజీ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు వసతిగృహం లేకపోవడంతో అడ్మిషన్లు పొందేందుకు తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో అడ్మిషన్లపై తీవ్రప్రభావం పడుతోంది. ఆసక్తిగా వచ్చినవారు నిరుత్సాహంతో వెనుదిరిగి వెళ్తున్నారు. చుట్టు పక్క గ్రామాలకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడం, ఆయా గ్రామాల విద్యార్థులకు ఇందులో చదవాలని ఉన్నా వసతి సౌకర్యం లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

అడ్మిషన్లు పెరిగే అవకాశం

గంభీరావుపేట కేజీ టు పీజీ ప్రాంగణంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో దాదాపు 800 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. కానీ వసతి లేకపోవడం దానికి అడ్డంకిగా మారింది. జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు గతేడాది హాస్టల్‌ను ప్రారంభించారు. పాత గర్ల్స్ హాస్టల్‌లోనే కొనసాగిస్తున్నారు. కానీ ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న వారికి హాస్టల్ లేదు. మండలంలో ఎస్సీ వసతి గృహం మాత్రమే ఉంది. వారిని మినహాయిస్తే బీసీలు, మైనార్టీలు, ఓబీసీలు, ఎస్టీలకు హాస్టల్‌లో సీట్లు లభించడం లేదు. గతంలో బాలికల హాస్టల్, బీసీ హాస్టళ్లు గంభీరావుపేటలో ఉండేవి. విద్యార్థుల నమోదు లేని కారణంగా వాటిని మూసేశారు. బీసీ హాస్టల్ భవనాలు నిరుపయోగంగానే ఉంటున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపి కేజీ టు పీజీ ప్రాంగణానికి అనుబంధంగా అన్నివర్గాల వారికి హాస్టల్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరే విధంగా ప్రాంగణం వేలాది మంది విద్యార్థులతో కళకళలాడే అవకాశం ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మారుమూల గ్రామాల విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



కేజీ టు పీజీలో భాగంగా ఉన్న పాఠశాలకు రోజూ ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు వస్తూ ప్రవేశాల కోసం అడుగుతున్నారు. క్యాంపస్‌ను ప్రత్యక్షంగా చూసి అడ్మిషన్ కోసం ఆసక్తి చూపుతున్నారు. కానీ వసతి గృహం లేకపోవడంతో నిరాశతో వెళ్తున్నారు. హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– గంగారాం, ప్రధానోపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్(బాలుర)

వసతి గృహం ఏర్పాటు చేయాలి



మాది గంభీరావుపేట మండలం నర్మాల గ్రామం. మా కొడుకు నర్మాల పాఠశాలలో చదువుతున్నాడు. కేజీ టు పీజీలో చదివించాలని ఉంది. రోజూ ఇక్కడికి వచ్చి వెళ్లాలి అంటే ఇబ్బందిగా ఉంటుంది. హాస్టల్ ఉంటే బాగుండు. మంత్రి కేటీఆర్ స్పందించి హాస్టల్ సౌకర్యం కల్పించాలి.

– బొంగు మల్లేశం, నర్మాల

కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వం

- చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పంతం రవి



సమావేశంలో మాట్లాడుతున్న పంతం రవి

సిరిసిల్లటౌన్: బతుకమ్మ చీరలు నేసే కార్మికులు, ఆసాములను సర్కారు విస్మరిస్తోందని లాల్‌బావుటా చేనేత పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పంతం రవి అన్నారు. గురువారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కేటీఆర్ సిరిసిల్లలోని పవర్‌లూం పరిశ్రమకు అనుబంధంగా ఉన్న అన్నివర్గాల కార్మికులకు హామీలు ఇవ్వడమే తప్ప అమలు చేయడం లేదని విమర్శించారు. బతుకమ్మ చీరలు నేసే కార్మికులకు ఏళ్లుగా యారన్ సబ్సిడీ ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు అజ్జ వేణు, వడ్డేపల్లి లక్ష్మణ్, వంగరి సత్యనారాయణ, విజయ్‌కుమార్, రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: ఈనెల 3 నుంచి ప్రారంభించే బడిబాటను విజయవంతం చేయాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కావలి అశోక్‌కుమార్, కటకం రమేశ్ పేర్కొన్నారు. గురువారం టీఆర్‌టీఎఫ్ జిల్లా శాఖ సమావేశం జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు హాజరై మాట్లాడారు. విద్యార్థుల సంఖ్యను పెంచి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. పాఠశాలల ప్రారంభంలోనే విద్యా వలంటీర్లు, స్కావెంజర్లను నియమించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోయన్నగారి నారాయణ, ప్రధాన కార్యదర్శి బుర్ర కృష్ణ ప్రసాద్‌గౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో పెరిగిన వృద్ధిరేటు

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: నెలవారీ లక్ష్యం తగ్గినప్పటికీ బొగ్గు ఉత్పత్తిలో వృద్ధిరేటు పెరిగిందని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మేనెలలో 3.92లక్షల టన్నుల లక్ష్యానికి 3.59లక్షల టన్నులు సాధించి 92శాతం నమోదు చేసిందన్నారు. ఏరియాకు టార్గెట్ పెంచడంతో నిర్దేశిత లక్ష్యాల సాధనలో వెనుకపడినట్లు పేర్కొన్నారు. గతేడాదితో పోల్చితే 8శాతం వృద్ధిరేటు నమోదైందన్నారు. మరో 15నెలల్లో ర్యాపిడ్‌గ్రావిటీ పిల్లర్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నీటిని శుద్ధిచేసే నిర్మాణ పనులు టెండర్ దశలో ఉన్నాయన్నారు. గోదావరినది ఇంటెక్ వద్ద సాంకేతిక లోపంతో నీటి సరఫరాలో ఇబ్బంది అవుతోందని, త్వరలో సమస్య అధిగమిస్తామని వెల్లడించారు. డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, సివిల్ డీజీఎం నవీన్, ఐఈడీ డీజీఎం అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఇంటి నిర్మాణం

- సొంత ఖర్చులతో నిర్మించిన రామగుండం తహసీల్దార్



ఇంటిని ప్రారంభించిన తహసీల్దార్ జాహెద్‌పాషా

రామగుండం: పట్టణంలోని ఎస్టీ కాలనీలో ఓ నిరుపేద కుటుంబానికి తహసీల్దార్ జాహెద్‌పాషా తన సొంత ఖర్చులతో ఇంటిని నిర్మించి, మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఎస్టీ కాలనీకి చెందిన ధరావత్ లచ్చమ్మది పేద కుటుంబం. ఆమె కుమారుడు, కోడలు మృతిచెందగా మనవడు, మనవరాలితో పూరి గుడిసె ఉంది. ఇటీవలి అకాల వర్షాలకు అది కూలిపోయింది. దీంతో వారు తలదాచుకునేందుకు నీడ కరువైంది. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ సంగీత వారికి ఇంటిని నిర్మించి, ఇవ్వాలని రామగుండం తహసీల్దార్ జాహెద్‌పాషాకు సూచించారు. ఆయన తన సొంత ఖర్చులతో గుడిసె స్థానంలో అన్ని సౌకర్యాలతో కూడిన ఇల్లు నిర్మించి, గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్, స్వచ్ఛంద సంఘాల సలహాదారు దయానంద్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-2 ఏరియాలో 101 శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం అబ్దుల్ సలీం

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2లో 101శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఎస్ఓటూ జీఎం అబ్దుల్‌సలీం తెలిపారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మేనెలలో 7.76లక్షల టన్నుల లక్ష్యానికి 7.86లక్షల టన్నులు 101శాతంగా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 49.95లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీతకుగాను 51.74లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించి 104శాతం సాధించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఏరియా ఇంజినీర్ రాధాక్రిష్ణారావు, రక్షణ అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



గాయపడ్డ నరేశ్

కథలాపూర్: మండలకేంద్రం శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరికొండ గ్రామానికి చెందిన పాలెపు నరేశ్ అత్తగారి ఊరైన దుంపేట గ్రామం నుంచి స్వగ్రామం సిరికొండకు బైకుపై వెళ్తున్నారు. కథలాపూర్ శివారులో మూలమలుపు వద్ద వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నరేశ్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మెట్‌పల్లి: పట్టణంలోని వెంకట్రావుపేట శివారులో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గజ్జెల మనోహర్ (42) మృతిచెందినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా రేంజర్లకు చెందిన మనోహర్ ద్విచక్రవాహనంపై మెట్‌పల్లికి వెళ్తుండగా, వెంకట్రావుపేట శివారులో బైక్‌ను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మనోహర్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆర్మూర్‌లోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుండెపోటుతో యువకుడు..



రాజేందర్ (ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం జాబీతాపూర్ గ్రామానికి చెందిన రాజుల రాజేందర్ (30) గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రాజేందర్ గురువారం ఉదయం ఛాతిలో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. జగిత్యాలలోని ఓ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య మౌనిక, మూడేళ్ల కూతురు ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనేనంటూ బంధువుల ఆందోళన

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌లో గల ఆస్పత్రిలో ఓ వ్యక్తి మృతిచెందగా వైద్యుల నిర్లక్ష్యంతోనేనంటూ బంధువులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. గొల్లపల్లి మండలం తిర్మలాపూర్‌కు చెందిన అరుణ్ (38) అనారోగ్యంతో పది రోజుల క్రితం ఆస్పత్రిలో చేరాడు. అప్పటి నుంచి వైద్యులు చికిత్స అందిస్తుండగా గురువారం రాత్రి మృతిచెందాడు. రూ. 8లక్షల వరకు వైద్యం కోసం ఖర్చుచేశామని, వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడంటూ బంధువులు ఆందోళన చేపట్టారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ఆందోళన విరమింపజేశారు.

భార్యపై హత్యాయత్నం

- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

వేములవాడ రూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో భార్యపై భర్త హత్యాయత్నం చేయగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ వెంకటేశ్ తెలిపారు. మ్యాకల నర్సయ్య బుధవారం రాత్రి భార్య లక్ష్మిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడని, చికిత్స నిమిత్తం వేములవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. వారికి సంతానం లేకపోవడంతో తరచూ భార్యాభర్తలు మధ్య గొడవ జరుగుతుందని, ఈ క్రమంలోనే నర్సయ్య హత్యాయత్నానికి పాల్పడినట్లు సీఐ పేర్కొన్నారు.

చెరువులో నీట మునిగి అస్వస్థత

రుద్రంగి (వేములవాడ): చెరువులో చేపలవేటకు వెళ్లిన వ్యక్తి అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలించిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. తోటి జాలరులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన మత్స్యకారులు గురువారం మండల కేంద్రంలోని గోలెపు లొద్ది చెరువులో చేపల వేటకు వెళ్లారు. చేపలు పడుతుండగా ఎల్ల రాజనర్సయ్య (55) అస్వస్థతకు గురై నీట మునిగాడు. గమనించిన తోటి జాలరులు రాజ నర్సయ్యను బయటకు తీసుకువచ్చి చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పగలు రెక్కీ.. రాత్రి చోరీ

- వరుస దొంగతనాలతో భయాందోళనలో ప్రజలు
- వలస కూలీలపైనే అనుమానాలు
- ఇటీవల పెరిగిన వలస కూలీల రాక
- రాజన్నపేటలో ఒకే రోజు ఏడు ఇళ్లలో చోరీ
- జిల్లాలో 23,600 మంది వలస కూలీలు



రాజన్నపేటకు చెందిన దండం మైసయ్య ఇంట్లోదొంగలు పడగా వారి ఆచూకీ తెలుసుకునేందుకు డాగ్‌స్క్వాడ్‌తో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ చోరీ ఘటనలో రెండు జతల బంగారు కమ్మలు, ఒక ఉంగరం, తులం బంగారం, రూ.35వేల నగదు చోరీకి గురయ్యాయి.



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో వరుస దొంగతనాలతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. పగలు రెక్కీ నిర్వహించి పథకం ప్రకారం రాత్రి చోరీలకు పాల్పడుతున్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల సంచారం ఇటీవల పెరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్, ఒడిశా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భవన కార్మికులుగా, కోళ్ల ఫారాల్లో కూలీలుగా, కొనుగోలు కేంద్రాల్లో హమాలీలుగా, వ్యవసాయ కూలీలుగా ఇక్కడికి వలస వస్తున్నారు. జిల్లాలో 23,600 మంది వలస కూలీలు ఉన్నట్లు సమాచారం.

బ్రోకర్ల ద్వారా వలస కూలీల రాక

జిల్లాకు వివిధ పనుల కోసం వస్తున్న కూలీలు బ్రోకర్ల ద్వారా ఇక్కడికి చేరుకుంటున్నారు. బ్రోకర్లు వలస కూలీల పూర్తి వివరాలను తెలుసుకోకుండానే ఇక్కడ పనిలో పెడుతున్నారు. వారు రాత్రివేళల్లో రోడ్లపై సంచరిస్తుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అర్ధరాత్రి వరకు మద్యంమత్తులో ఉండటం, ప్రధాన రహదారులపై గుంపులుగా కూర్చోవడంతో స్థానికులు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. వలస కూలీల కదలికలపై పోలీసుల నిఘా లేకపోవడంతో వరుస దొంగతనాలు పెరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వలస కూలీల వివరాలు సైతం కార్మికశాఖ అధికారుల వద్ద లేవు. ఈక్రమంలో జిల్లాలో జరుగుతున్న పలు చోరీల్లో దొంగల వివరాలు తెలియడం లేదు. కాగా వలస కూలీలపైనే దొంగతనాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా రాష్ట్రాలకు చెందిన వారు దొంగతనాలే కాకుండా హత్యలకు వెనుకాడరని గతంలో జరిగిన పలు సంఘటనల ద్వారా అర్థమవుతోంది.

వరుస చోరీలు..

జిల్లాలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఎల్లారెడ్డిపేట మండలంలోని మారుమూల గ్రామమైన రాజన్నపేటలో ఒకేరోజు ఏడు ఇళ్లలో దొంగలు తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడడం కలకలం రేపింది. ఈ సంఘటన జరిగిన రెండోరోజే మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. రాచర్లగుండారం నుంచి మద్దిమల్ల వెళ్తున్న ద్విచక్రవాహనదారులను అడ్డగించి వారి నుంచి నగదు, రెండు సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. వరుస దొంగతనాలతో పోలీసులు రాత్రి పూట పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి, నిఘా పెంచారు. జిల్లాలో జరిగిన దొంగతనాలపై పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దొంగతనాలకు పాల్పడింది పాతనేరస్తులు కాదనే విషయం పోలీస్ విచారణలో తేలడంతో అందరిదృష్టి వలస కూలీలపైనే పడింది. బ్రోకర్ల నుంచి వలసకూలీల పూర్తి వివరాలను పోలీసులు సేకరించి, కదలికలపై నిఘా పెంచాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

నిఘా పెంచాం

జిల్లాలో జరుగుతున్న దొంగతనాలపై పోలీసులు నిఘా పెంచాం. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీల వివరాలను సేకరిస్తున్నాం. రాజన్నపేటలో జరిగిన దొంగతనంపై వేలిముద్రలు సేకరించి, పాత నేరస్తులను విచారిస్తున్నాం. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తున్నాం. బ్రోకర్లు కూలీలను చేర్చుకునే ముందు వారి పూర్తి బయోడేటాను సేకరించి పోలీసులకు అందించాలి. – మొగిలి, సీఐ, ఎల్లారెడ్డిపేట

ఇది పట్టా భూమే.. కాదు శిఖం



ట్రాక్టర్లతో దున్నిన భూమి



బైఠాయించిన ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

- ట్రాక్టర్లతో దున్నించిన కరీంనగర్‌వాసులు
- అక్కడే బైఠాయించిన ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు
- మానకొండూర్ చెరువు వద్ద ఘటన

మానకొండూర్: స్థానిక పెద్ద చెరువు పైభాగంలో ఉన్న భూమికి తాము పట్టా కలిగి ఉన్నామని కరీంనగర్‌కు చెందిన కొందరు ట్రాక్టర్లతో గురువారం దున్నారు. ఆర్ఐ జయలక్ష్మి, పోలీసు సిబ్బంది అడ్డుకొని, అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ భూమి పట్టాభూమి అంటూ పట్టాదారు చెబుతుండగా శిఖం భూమి అని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అంటున్నారు. చివరకు దున్నిన భూమిలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు టెంట్ వేసి, బైఠాయించారు. వివరాల్లోకి వెళ్తే.. మానకొండూర్ పెద్ద చెరువును ప్రభుత్వం మినీ ట్యాంకుబండ్‌గా మార్చాలని భావించింది. దీనికిగాను 2016లో రూ.5.69 లక్షలు కేటాయించింది. చెరువు కట్టను అభివృద్ధి చేయడంతోపాటు, చెరువు శిఖంలో చిల్డ్రన్స్ పార్కు కోసం మూడెకరాల పైచిలుకు స్థలంలో వందలాది క్యూబిక్ మీటర్ల చెరువు మట్టిని పోసి, చదును చేశారు. గతేడాది గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో క్రీడాప్రాంగణం ఏర్పాటైంది. కాగా కరీంనగర్‌కు చెందిన మర్రి సతీశ్, సుందరమ్మ, జయమ్మ, నాగరాజు, మహిపాల్, ఉమాదేవిలు ఈ భూమి తమదేనంటున్నారు. 1274/2, 1274/3, 1274/4 సర్వే నంబర్లలో 9.39 గుంటల భూమిని ఇదే గ్రామానికి చెందిన బొప్పు నర్సయ్య నుంచి 1987లో కొనుగోలు చేశామని, పట్టాదారు పాసుపుస్తకాలతోపాటు, రైతు బంధు, రైతుబీమా పొందుతున్నామని తెలిపారు. 2.34 గుంటల భూమిపై వివాదం ఉండగా హైకోర్టును ఆశ్రయించామని, కోర్టు సైతం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. అందుకే భూమిని దున్నడానికి వచ్చినట్లు తెలిపారు. అధికారులు తహసీల్దార్ లక్ష్మారెడ్డికి సమాచారం అందించారు. ఆయన అక్కడికి వచ్చి, పట్టాదారులమని చెప్పుకుంటున్న వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. 15.06.23 వరకు దీనిపై కోర్టు స్టేటస్‌కో ఉన్నందున అప్పటివరకు ఆగాలని సూచించారు. సీఐ రాజ్‌కుమార్ వచ్చి, భూమి దున్నిన వ్యక్తులతో మాట్లాడారు. ఈ స్థలం శిఖం భూమి అని జెడ్పీటీసీ సభ్యుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్ పేర్కొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలంలోని రాచపల్లి గ్రామంలో వీధికుక్కల దాడిలో ఆరేళ్ల బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన చెరుకు కేశవరెడ్డి కుమారుడు ఆరుష్‌రెడ్డి గురువారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటున్నాడు. వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో బాలుడి చేయి, భుజంపై గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చిన్నారిని రక్షించి, జమ్మికుంటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.